నేడు 24 కేంద్రాల్లో కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈనెల 22వ తేదీన నిర్వహించనున్న కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా ఏలూరు నగరంలో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉంటుంది. జిల్లావ్యాప్తంగా సుమారు 14 వేల మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న అధికారులు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోని అధికారులు ఎవరూ సెల్‌ఫోన్లు వినియోగించొద్దన్నారు. ఆటోడ్రైవర్లు అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు సకాలంలో తీసుకువెళ్లేలా సహకరించాలని సూచించారు. అభ్యర్థులు ఎవరూ అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఇళ్లు.. ఏళ్లు..!

ముందుకు సాగని ఇళ్ల నిర్మాణం
తొలివిడతగా ఏలూరు జిల్లాలో లక్షా 3 వేలు ఇళ్ల నిర్మాణం లక్ష్యం
ఇప్పటి వరకూ 14 వేలు పూర్తి
ఉగాదినాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంతో ముందుకు
ఆర్థిక భారంతోనే ముందుకు రాని లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కి అనే చందంగా మారింది. తొలివిడతగా ఇళ్ల నిర్మాణానికి నిర్దేశించుకున్న లక్ష్యానికి.. పూర్తయిన ఇళ్లకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. అదేవిధంగా కొనసాగితే ఇళ్ల నిర్మాణ ప్రక్రియ పూర్తవడానికి ఎన్నేళ్లు పడుతుందోననే చర్చ నడుస్తోంది. ఏలూరు జిల్లాలో తొలివిడతగా 1,03,077 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మొదలై దాదాపు రెండేళ్లు అవుతోంది. ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్ల నిర్మాణం కేవలం 14 వేలు మాత్రమే. అంటే తొలి విడత ఇళ్ల నిర్మాణ లక్ష్యంలో ఒకటో వంతు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. వచ్చే ఉగాది నాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తీసుకున్నట్లు ఇటీవల జిల్లాలో పర్యటించిన గృహ నిర్మాణ రాష్ట్రస్థాయి అధికారులు తెలిపారు. దాదాపు రెండేళ్లలో 14 వేలు ఇళ్ల నిర్మాణం పూర్తవగా రెండు నెల్లలో 12 వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడం ఎంతవరకూ సాధ్యమో అధికారులు చెప్పాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ఏలూరు జిల్లాతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోనూ నత్తనడకన సాగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో రోడ్లు, నీరు, విద్యుత్‌, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. అంతేకాకుండా చాలాచోట్ల జగనన్న కాలనీలు ఊరికి దూరంగా ఉండటంతోపాటు ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా లేని పరిస్థితి ఉంది. దీంతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు పెద్దగా ముందుకురాని పరిస్థితి ఏర్పడింది. ఇదంతా ఒకవైపు అయితే, ఆర్థిక భారం మరో ప్రధాన సమస్యగా లబ్ధిదారులకు మారింది.

ప్రభుత్వ సాయం గోరంత.. నిర్మాణ ఖర్చు కొండంత

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. ఇసుక, సిమెంట్‌, ఐరన్‌, కంకర, నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. రెండు గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే తక్కువగా లెక్కించినా రూ.ఆరు లక్షలకుపైగా ఖర్చవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము పునాదుల వరకూ కూడా రావడం లేదు. ఇచ్చే సొమ్ము విడతలవారీగా ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి. ఇళ్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వం ఇచ్చే సొమ్ముకాకుండా అదనంగా రూ.నాలుగు నుంచి రూ.ఐదు లక్షల సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోంది. అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేపడితే తీర్చే పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా సాయం పెంచాలని ఎప్పటినుంచో డిమాండ్‌ వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అప్పు చేసి ఇల్లు కడితే వడ్డీభారం మోయలేమని, అప్పు కట్టిన ఇల్లు సైతం అమ్ముకోవాల్సి వస్తుందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని అనేకచోట్ల లబ్ధిదారులను హెచ్చరిస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుంటున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అయినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఉత్సాహం చూపడం లేదు. తొలివిడతగా నిర్దేశించుకున్న లక్ష్యానికి ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలంటే ఇప్పట్లో అయ్యే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం సాయం పెంచడంతోపాటు జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తే కొంతలో కొంత లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన సరికాదు

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా



ట్రాన్స్‌కో ఎస్ఇకి వినతిని అందిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నివాసాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనను, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ఆలోచనను ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ రంగానికి, ఎస్‌సి, ఎస్‌టి తదితరులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ఏలూరులోని జిల్లా విద్యుత్ భవన్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కేంద్ర విద్యుత్ చట్టం 2005కు సవరణలు, ప్రతిపాదనలు బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే వ్యతిరేకిస్తుంటే మోడీ ఆదేశాల మేరకే మన రాష్ట్రంలో సిఎం జగన్ అమలు చేయడానికి పూనుకోవడం దారుణమని విమర్శించారు. స్మార్ట్, ప్రీపెయిడ్, ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై వేలకోట్ల భారాలు మోపుతున్నారని విమర్శించారు. వ్యవసాయ మీటర్ల వినియోగదారులపై ఆరువేల కోట్ల భారం పడుతుందని తెలిపారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండా మీటర్ల కొనుగోలు చేయరాదని, అయినా ఏకపక్షంగా కొనుగోలు చేశారని చెప్పారు. హరిత ఎనర్జీ పేరుతో 75 వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటోందని తెలిపారు. ఒక్కో స్మార్ట్ మీటరు రూ.13 వేల నుండి రూ.14 వేల వరకూ ఖర్చవుతుందని అంటే సుమారు పది వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం పడుతుందని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి జగన్ మాట తప్పారని విమర్శించారు. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఇప్పటికే అదనపులోడు, డిపాజిట్ల పేరుతో భారాలు వేస్తున్నారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ కోత పెట్టారని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే పద్ధతితో వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు కూడా ఎసరు పెట్టారన్నారు. ప్రభుత్వం ఇదే పద్ధతిలో ముందుకెళితే 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం మాదిరే మరో విద్యుత్ పోరాటం జరుగుతుందని హెచ్చరించారు. 2023-24 సంవత్సరం లోటుగా చూపించిన 13 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వమే సబ్సిడీగా ఇవ్వాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించరాదని, ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే వసూలు చేస్తున్న ట్రూ అప్ ఛార్జీలను నిలిపి వేయాలని రవి డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిపిఎం జిల్లా కమిటీ తరపున ట్రాన్స్‌కో ఎస్ఇ అధికారి సాల్మన్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్‌ను ఎట్టి పరిస్థితులలోనూ తొలగించబోమని హామీ ఇచ్చారు. అదే విధంగా వినతిపత్రంలోని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా, నగర నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పి.కిషోర్, ఎ.శ్యామలారాణి, కె.శ్రీనివాస్, రామకృష్ణ, పి.ఆదిశేషు, లెనిన్, సాయిబాబు, జగన్నాథరావు, గోపి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని పలు ప్రజాసంఘాలు ట్రాన్స్‌కో ఎస్ఇకి వినతిని అందించాయి. ఈ సందర్భంగా ఏలూరు నగర అభివృద్ధి కమిటీ నాయకులు పి.కిషోర్, పన్నుల వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కట్టా సత్యనారాయణ తమ బృందంతో కలిసి వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ నాయకులు ఏసుబాబు, కోటేశ్వరరావు, ఇస్సాక్, పన్ను వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గోపి, గౌడ రవీంద్ర, లెనిన్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఐటిడిఎలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహించడంతో గిరిజన ప్రాంతం మరింత వెనుకబడుతోందన్నారు. పార్టీ మండల కమిటీ సమావేశం కొరసా జలపాల అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టు ఎస్‌డిసిలను నియమించినప్పటికీ గంట వ్యవధిలోనే వేరే ప్రాంతాలకు బదిలీ చేయడాన్ని విమర్శించారు. అధికారులు లేకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని, వైద్యం అందక గిరిజనులు చనిపోతున్నారని దీనిపై కింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేకపోవడం వల్ల భూ సమస్యలు పరిష్కారం కాక గిరిజనులు అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెగ్యులర్ పిఒను, ఎస్‌డిసిలను నియమించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పి.నాగేశ్వరరావు, ఉడతా వెంకటేశ్వరరావు, చోడెం దుర్గ, మోడీయం నాగమణి, తామ ముత్యాలమ్మ, తెల్లం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్రాన్సిస్

సబ్‌ప్లాన్ అమలుకు ఆర్డినెన్స్ తీసుకురావాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను శాశ్వతంగా అమలు చేయాలని, ఈనెల 23తో కాలపరిమితి పూర్తవుతుందని, వెంటనే శాశ్వత ఆర్డినెన్స్ తీసుకురావాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలి సభలో శాశ్వత ఆర్డినెన్స్ తీసుకురావాలని బిల్లు పెడతామని, ఇప్పటికే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రికి లేఖరాశామని తెలిపారు. జనసేన, టిడిపి, వైసిపిలో దళిత గిరిజనుల పట్ల తమవైఖరి తెలపాలని, లేనిపక్షంలో దళిత గిరిజన వ్యతిరేకులుగా మారే అవకాశం ఉందన్నారు. అనంతరం జెసికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ 2013లో అమల్లోకి వచ్చిందని అప్పటినుంచి ఇప్పటివరకూ రూ.లక్షా 18 వేల కోట్లు గ్రాంట్ వచ్చిందని, కానీ ఈ నిధులను కూడా 60 శాతం ఖర్చయిందని మిగిలిన 40 శాతం దళితులకే ఖర్చు పెట్టాలన్నారు. మాలమహాసేన జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ మాట్లాడుతూ ప్రణాళిక శాశ్వతంగా అమలు చేయాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులు కూడా నవరత్నాలకు మళ్లించిందని దళిత గిరిజన పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. జెపిసి కన్వీనర్ సంజీవయ్య, బౌద్ధ ధర్మ ట్రస్ట్ అంబేద్కర్ రిస్ట్ మని సింగ్, దిలీప్, మాలమహాసేన జిల్లా అధ్యక్షులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ పాల్గొన్నారు.

లెనిన్ సిద్ధాంతం ప్రపంచానికి ఆదర్శం

ప్రజాశక్తి - ఏలూరు



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ప్రపంచంలో పుట్టిన ప్రతిమనిషి సమానమే, తన శ్రమకు తగ్గ ఫలితాన్నిపొందాలి, ఈ ప్రపంచంలో ఉన్న మానవవనరులన్నీ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉన్నతమైన లక్ష్యంగా జీవించిన లెనిన్ జీవితం ధన్యమని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం లెనిన్ వర్ధంతి సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ శ్రమకు తగ్గ ఫలితం అందాలని, మానవ వనరులు అందరికీ అందుబాటులో ఉండే సమసమాజం ఈ ప్రపంచంలో ఉండాలనే సిద్ధాంతాన్ని రూపొందించిన కారల్ మార్క్స్, ఎంగెల్స్ ఆశయాన్ని ఆచరణలోకి తీసుకొచ్చిన మహనీయుడు లెనిన్ అని తెలిపారు. లెనిన్ నాయకత్వాన రష్యాలో రాచరికాన్ని, పెట్టుబడిదారీవ్యవస్థను కూల్చి సమసమాజాన్ని నిర్మించుకున్నారని తెలిపారు. అందరికీ విద్య, ఉద్యోగం, ఉపాధి, అన్ని అవకాశాలు అందరికీ అందించిన గొప్ప వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు ఈ సిద్ధాంతం కోసమే పోరాటాలు చేస్తున్నారని, ఎప్పటికైన ఈ ప్రపంచానికి కమ్యూనిస్టు సిద్ధాంతమే ఉన్నతమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్యామలారాణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, లెనిన్, ప్రసాద్, నారాయణరాజు, సీతారాం, షాజమా, ఇసాక్ పాల్గొన్నారు.

ఎర్రకాలువ మిగులు భూముల సాగుకు

హక్కు పత్రాలివ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - టి.నరసాపురం

డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతిని అందిస్తున్న పేదలు

ఎర్రకాలు రిజర్వాయర్ మిగులు భూములు సాగు చేస్తున్న రైతులందరికీ పంటహక్కు పత్రాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వ్యకాస ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్లో ధర్నా నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయంలో డిటికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పుసం సూర్యారావు మాట్లాడుతూ మండలంలోని వంద రామన్నపాలెం రెవిన్యూ పరిధిలో మల్లప్పగూడెం, సాలీ గూడెం, అబ్బుల్లాపురం, మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో ఆదివాసీలు, దళితులు, భూమిలేని పేదలు, 2018 నుంచి 300 ఎకరాల్లో వరి, పత్తి, మినుము పంటలు వేసుకుని సాగు చేస్తున్నారని వారికి పంట ఫల సాయం పొందే విధంగా సాగుకు ఇవ్వాలని గౌరవ శ్రీ హైకోర్టు వారి రీట్ పిటిషన్ ద్వారా తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుద్ధుల రామలక్ష్మి, బుద్ధుల చెల్లమ్మ, బుద్ధుల సీత, సరియం దుర్గమ్మ, యడ్లపల్లి బాలస్వామి సాలిగూడెం, అబ్బుల్లాపురం, మల్లప్పగూడెం, మధ్యాహ్నపు వారి గూడెం, ఆదివాసులు, దళితులు, భూమి లేని పేదలు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ కోరుతూ ఎంఎల్ఎకు వినతి

టి.నరసాపురం: టి.నరసాపురం పంచాయతీలోని ఎర్రకాలువ వెలుపల ఉన్న ఆరు గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రత్యేక పంచాయతీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల యువకులు శనివారం పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లోని సమస్యలపై ఎంపిపి దారబోయిన లక్ష్మితో పాటు ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నరసాపురం పంచాయతీలోని ఆరు గ్రామాలైన కృష్ణాపురం, రుద్రమకోటరాజుగూడెం, పుట్రేపు, ప్రకాష్‌నగర్, కాపుగూడెం, రాజులగూడెం గ్రామాలను విడదీసి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. అధ్వానంగా ఉన్న పుట్రేపు, బండివారిగూడెం రోడ్డును అభివృద్ధి చేయాలని కృష్ణాపురం గట్టుపై ఆక్రమణలను తొలగించి నిరుపేదలకు ఇవ్వాలని కోరారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి సమస్యలు, కృష్ణాపురంలో అంగన్వాడీ సెంటర్‌లో విద్యుత్ సర్వీస్ సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు, గ్రామాల్లో రోడ్లు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ బాలరాజు హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో అర్జా సాగర్, భూక్యా వేణుగోపాల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమతో మహిళలకు ఉపాధి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో పట్టుపురుగుల పెంపకాన్ని (సెరీ కల్చర్) మరింత విస్తరించడంతోపాటు పెద్దఎత్తున మహిళలను ఈ రంగంలో ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం కేంద్ర పట్టుపరిశోధన, శిక్షణా సంస్థ మైసూర్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్ పట్టుపరిశ్రమల ఆధ్వర్యంలో బైవోల్టేన్ సెరీ కల్చర్‌తో స్థిర ఆదాయం-ఉత్పాధకత పెంచేందుకు అనుసరించాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఏలూరు, కాకినాడ, ఎన్‌టిఆర్, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కృష్ణ జిల్లాలకు చెందిన మల్బరీసాగు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుపరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతిస్తుందని, సాగుకు ముందుకు వచ్చే రైతులకు విధాలుగా తోడ్పాటునిస్తుందన్నారు. మహిళలు మల్బరీసాగువైపునకు రావాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహాన్ని అందిస్తామని చెప్పారు. వ్యవసాయక ప్రాంతమైన ఏలూరు జిల్లాలో 1500 ఎకరాల్లో 570 మంది రైతులు సెరీ కల్చర్ సాగుచేయడం ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ఎంతో సులభతరమైన ఈ రంగంవైపు రైతులు మళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఏలూరు జిల్లాలో 50 శాతం వ్యవసాయం, మరో 50 శాతం ఉధ్యాన పంటలైన ఆయిల్ పామ్, మొక్కజొన్నవంటివి ఉన్నాయన్నారు. కొంతభాగం ఆక్వా కల్చర్ ఉందన్నారు. అయితే జిల్లాలో మల్బరీసాగుపై ముఖ్యంగా మహిళా రైతులను ప్రోత్సహించే దిశగా డిఆర్‌డిఎ, సెరీ కల్చర్, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. మల్బరీసాగు ద్వారా ఏడాదికి రూ.ఐదు లక్షల వరకూ ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ల స్థాపనపై కూడా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. ఇందుకు పిఎంఇజిపి ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు పొందొచ్చన్నారు. వంద మంది రైతులు కామన్ క్లస్టర్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటే ప్రోసెసింగ్ యూనిట్లకు సబ్సిడీపై ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కింద కూడా ఈ రంగం అభివృద్ధికి ప్రోత్సాహం పొందొచ్చన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతపురం కేంద్ర పట్టుపరిశోధనా, శిక్షణా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ కెపి.కిరణ్ కుమార్, మైసూర్ కేంద్ర పట్టుపరిశోధన, శిక్షణా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మేరీ జోసఫ్, ఎపి సెరీ కల్చర్ అడిషనల్ డైరెక్టర్ సి.అరుణకుమారి, కృష్ణగిరి ఆర్ఇసి శాస్త్రవేత్త డాక్టర్ కె.ఝాన్సీలక్ష్మి, సిఎస్ఎస్ బి రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ పి.సుధాకర్, గుంటూరు సెరీ కల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సాజిదాబేగం, ఏలూరు, కాకినాడ, ఎన్‌టిఆర్ జిల్లాల సెరీ కల్చర్ అధికారులు డి.వాణి, బిఎంవి.రాజు, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెరీ కల్చర్ సాగులో ఉత్తమ రైతులుగా నిలిచిన వారిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

అంతన్నారు.. ఇంతన్నారు..!

గుండాట ఆపి కోడిపందేలను ఆపకపోవడంపై పెదవివిరుపు
ఐటిడిఎకు పూర్తిస్థాయి పిఒ వచ్చేనా

సంక్రాంతి పండుగ వెళ్లిపోయింది. పండుగకు ముందు.. పండుగ సమయంలో అధికారుల తీరుపై సర్వత్రా చర్చ ప్రారంభమైంది. పండుగకు ముందు పది రోజుల నుంచి కోడిపందేలు నిర్వహిస్తే అడ్డుకుంటామని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతోపాటు సరికొత్తగా పోలీసు శాఖ తరపునే కాకుండా ఈ స్థలంలో పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయా స్థలాల యజమానులతో సైతం ఫ్లెక్సీలు కట్టించారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే పండుగ మూడు రోజులు మాత్రం కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. అయితే ఈసారి ఒక విషయంలో పోలీసు శాఖను మెచ్చుకోవాల్సిందే. అదేమిటంటే పందేలను అడ్డుకోకపోయినా పండుగ రెండో రోజు నుంచి గుండాట, పేకాట వంటి జూదాలను మాత్రం బరుల వద్ద నిరోధించారు. ఇది బరుల నిర్వాహకులను కంగుతిన్పించినా.. తామిచ్చిన మాముళ్ల సంగతేంటని పోలీసులను ఎదురు ప్రశ్నించినా 70 శాతం వరకూ బరుల్లో గుండాట వంటి జూదాలను ఆపారు. గత కొన్నేళ్లకు భిన్నంగా పోలీసులు, అధికారులు పండుగ రెండో రోజైనా కళ్లు తెరిచి జూదాలపై కొరడా ఝుళిపించడం అభినందనీయం. అయితే కొంతమంది ప్రముఖులు, పెద్దల అండతో ఏర్పాటు చేసిన బరుల వద్ద ఈ జూదాలను సైతం నిలువరించకపోవడం ఆ శాఖాధికారుల్లో డొల్లతనాన్ని ప్రతిబింబించి విమర్శలకు తావిచ్చింది. ఇక పందేల విషయంలో మాత్రం ముందు చెప్పిన మాటలకు, పండుగ మూడు రోజుల చేతలకు భిన్నమైన పరిస్థితి ఉండటంపై ఆ శాఖాధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

ఇప్పటికే రకరకాల సాకులతో పోలీసులు మండల, నియోజకవర్గస్థాయి అధికారులకు మెమోలు ఇచ్చేందుకు సిద్ధమైనా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండటంతో వెనక్కి తగ్గినట్లు సమాచారం. అయితే గ్రామాల్లో విఆర్‌ఒలు, మహిళా పోలీసులు, ఆయా గ్రామాల పోలీసు కానిస్టేబుళ్లపై తూతూమంత్రంగా చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. గుండాట వంటి వాటిని నిరోధించినట్లు పందేలను సైతం అడ్డుకుని ఆపాల్సిందేనని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చి ఉంటే ఆ పందేలు సైతం ఆగేవి. చేయాల్సిన పని ఉన్నతాధికారులు చేయకుండా కింద సిబ్బందిపై నెపం మోపేలా చర్యలకు దిగాలనే ఆలోచన ఎంతవరకూ సమంజసమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనా ఈ సంవత్సరం గుండాట వంటి జూదాలను ఆపిన తీరులో వచ్చే సంవత్సరం మరో అడుగు ముందుకేసి కోడి పందేలను సైతం అడ్డుకుంటే పోలీసు శాఖ ప్రతిష్ట పెరుగడంతోపాటు చట్టాలపై విశ్వసనీయత పెరుగుతుందని అంతా చెబుతున్నారు.

ఇక జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో కెఆర్‌పురం ఐటిడిఎ ఉంది. రాష్ట్రంలోనే ఇది అతి చిన్న ఐటిడిఎగా ఉంది. గతంలో ఐఎఎస్ అధికారులను పిఒలుగా నియమించేవారు. కాలక్రమంలో ఐటిడిఎలకు నిధులు తగ్గించడంతోపాటు ఇతర శాఖల నుంచి అధికారులను డిప్యూటేషన్‌పై నియమించడం ఆనవాయితీగా మారింది. అయినప్పటికీ వచ్చిన అధికారి ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకూ పని చేయడంతో గిరిజనులు తమ సమస్యలను చెప్పుకునే ప్రయత్నం చేసేవారు. తమ సమస్య పరిష్కారం కాకపోయినా గుండెల్లో బాధ అధికారులకు చెప్పుకున్నామనే తృప్తి వారికి ఉండేది. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఐటిడిఎకు పూర్తిస్థాయిలో పిఒ నియామకం చేపట్టడం లేదు. దీంతో ఏజెన్సీలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాసితులైన గిరిజనులు తమ హక్కులు కోల్పోతున్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తాజాగా డిప్యూటీ కలెక్టర్ హోదాలోని అధికారిని పిఒగా నియమించి, మళ్లీ గంట వ్యవధిలోనే వేరేచోటకు బదిలీ చేయడం గిరిజనుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఏపాటిదో చెప్పకనే చెబుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వం, గిరిజన ప్రజాప్రతినిధులు స్పందించి కెఆర్‌పురం ఐటిడిఎకు పూర్తిస్థాయిలో పిఒను నియమించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో అధికారంలోకి రాకముందు వైసిపి నేతలు గిరిజనులకు అండగా ఉంటామంటూ ఇచ్చిన హామీలన్నీ కాకమ్మ కబుర్లుగానే గిరిపుత్రులు భావించే అవకాశం ఉంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

క్రీడలకూ ప్రాధాన్యత అవసరం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి కారుమూరి

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యతివ్వాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తెల్లం బాలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు మండల, గ్రామీణస్థాయిలలో కూడా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ క్రీడాపోటీల్లో అత్యుతమ ప్రతిభ కనబరిచిన వారికి శిక్షణ అందించి వారిని అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలు ఇరుకైన భవనాల్లో నిర్వహించడంతో క్రీడా సదుపాయాలు ఉండవని, అంతేకాక వారు క్రీడలకు ప్రాధాన్యతవ్వలేరన్నారు. ప్రతీ సంవత్సరం తన ఫౌండేషన్ ద్వారా క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆహ్లాదం, ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల ప్రోత్సాహానికి జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. శాసనసభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని యువతలో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని ఏడు గిరిజన మండలాల్లోని యువతకు వాలీబాల్, కబడ్డీ, విలువిద్య, తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

అనంతరం రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రారంభించారు. తొలుత ఎంఎల్ఎ బాలరాజు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కరాటం సీతాదేవి, ఎంపిపి కారం శాంతిరమణ, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, సర్పంచి టి.వెంకాయమ్మ, వైస్‌ఎంపిపిలు కుక్కల వరలక్ష్మి, గోపి, జి.మోహన్‌రావు, ఆర్‌డిఒ ఝాన్సీరాణి, కళాశాల ప్రిన్సిపల్ భక్త హనుమాన్, తహశీల్దార్ ఎస్.శాంతి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆటో డ్రైవర్లు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ అన్నారు. చింతలపూడి పట్టణంలో 34వ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని సిఐ మల్లేశ్వరావు ఆధ్వర్యంలో చింతలపూడి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆటో డ్రైవర్లతో స్థానిక లయన్స్ కబ్ల్ వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రహదారుల్లో వ్యతిరేక దిశగా ఆటోలను నడపరాదన్నారు. ప్రమాదాలకు కారణమవుతారన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంఘించరాదని, ఆటోలు నడిపే సమయంలో యూనిఫాం కచ్చితంగా ధరించాలని చెప్పారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

బాధితులను ఆదుకోవాలని టిడిపి చింతలపూడి నియోజకవర్గ నాయకులు సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఫాతిమాపురం గ్రామంలో పి.ఫణికుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడిని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ద్వారా రోషన్‌కుమార్ శనివారం పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. మిషన్ హోప్ స్వచ్ఛంధ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తన సొంత నియోజకవర్గ ప్రజలకు సేవ చేయటం సంతోషంగా ఉందన్నారు. బాధిత కుటుంబం రోషన్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, రాంబాబు పాల్గొన్నారు.

సమాజంలో మీడియా పాత్ర ప్రముఖం

ప్రజాశక్తి - చింతలపూడి

సమాజంలో మీడియా పాత్ర ప్రముఖమైందని టిడిపి నియోజకవర్గ నాయకులు, మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ అధినేత సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలో లయన్స్ క్లబ్ వద్ద ఎపిడబ్ల్యూజెఎఫ్ చింతలపూడి నియోజకవర్గ నూతన కార్యవర్గం కార్యక్రమనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. జర్నలిస్టులు వార్త రాసేటప్పుడు ఛాలెంజ్‌గా ఉండాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేలా అధికారుల, నాయకుల దృష్టికి సమస్యలు తీసుకురావాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రావు జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా నాయకులు గంగరాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి, చేయాల్సిన పోరాటం గురించి వివరించారు. అనంతరం టీవీ సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వ వైఫల్యాలను టిడిపి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని బంధంచర్ల గ్రామంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడు రామకృష్ణారావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయప్రదవు శ్రీరామమూర్తి, బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి పాల్గొన్నారు.

పాడిరైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

పాడిరైతులు మెలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక పాల ఉత్పత్తి పొందొచ్చని కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. కోటపాడులో పాల కేంద్రాన్ని ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సేవలు, రాష్ట్ర ప్రభుత్వ అమలు చేసే నవరత్నాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ జి.రాణి సూచించారు. మండలంలోని ముసునూరు, చక్కపల్లి, గుళ్లపూడి, బలివే, గోపవరం, చింతలవల్లి, లోపూడి గ్రామాల్లో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు అవగాహన కల్పించేందుకు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వారికి పలు సూచనలు, సలహాలు అందించారు.

పిఎస్ రావు అండ్ సన్స్ స్పోర్ట్స్ అధినేత మృతి

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన పిఎస్.రావు అండ్ సన్స్ స్పోర్ట్స్ అధినేత పోలూరి బాబూరావు(65) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. వీరి సతీమణి రిటైర్డ్ టీచర్ హేమలత ఇటీవల మృతి చెందారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రముఖ దినపత్రికలో కొంతకాలం జర్నలిస్టుగా పనిచేశారని సన్నిహితులు తెలిపారు. నూజివీడు పరిసరాల్లో స్పోర్ట్స్‌కు సంబంధించి అని పరికరాలను అందిస్తూ 1935 నుండి ఈ ప్రాంత వాసులకు సేవలందిస్తూ పిఎస్.రావు పేరు ప్రఖ్యాతలు పొందారు. బాబూరావు మృతికి నూజివీడు పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ప్రముఖులు, వర్తక వాణిజ్య వ్యాపారవేత్తలు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నేతలు, పలు ప్రజాసంఘాల నేతలు, పలువురు సామాజికవేత్తలు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు స్థలాల పంపిణీకి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని హౌసింగ్ ఎఇ సి.హెచ్ సురేష్‌బాబు వెల్లడించారు. 2.78 ఎకరాల భూమిలో రెండు మీటర్ల ఎత్తున ఇసుకతో మెరక పనులను ఆయన పరిశీలించారు. మట్టి నాణ్యంగా ఉండాలన్నారు. వారం పది రోజుల్లో మెరక పనులు పూర్తిచేసి వెంటనే లేఅవుట్లు వేసి ఇళ్ల నిర్మాణాలకు తీసుకోవాలని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ పనులను వైసిపి మండల కన్వీనర్ మంగారావు, నారాయణపురం పంచాయతీ ఉపసర్పంచ్ అడపా శ్రీను, సచివాలయం-2 ఉద్యోగులు పర్యవేక్షిస్తున్నారు.

నేరాలు - ఘోరాలు

పాముకాటుతో మహిళకు అస్వస్థత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం పంచాయతీ తాటివ్యారిగూడెం గ్రామానికి చెందిన నారం చుక్కమ్మ శనివారం మధ్యాహ్నం పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురైంది. దీంతో అస్వస్థతకు గురైన ఆమెను స్థానికులు, కుటుంబసభ్యులు జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాహనదారులకు జరిమానా

నూజివీడు:నూజివీడు పట్టణంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో శనివారం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ 59 కేసుల్లో రూ.43,965 పాత చలానాలు పెండింగ్‌లోనివి, 32 కేసుల్లో రూ.11055 నగదు వాహన చోదకుల నుంచి కట్టించుకున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన చోదకులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే వాహన చోదకులకు జరిమానాలు శిక్షలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి హెచ్చరించారు.

పాఠశాల బస్సులో పొగలు

జంగారెడ్డిగూడెం:స్థానిక బస్టాండ్ సెంటర్ ఏలూరు రోడ్డులో ప్రయివేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులో పొగలు రావడంతో విద్యార్థులు పరుగులు తీసిన ఘటన శనివారం జరిగింది. విద్యార్థులను స్కూలు అనంతరం విద్యార్థులను ఇంటికి చేరవేసేందుకు సిద్ధంగా ఉన్న బస్సులో ఒక్కసారిగా పొగలు వచ్చి ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన విద్యార్థులు బస్సు నుండి దిగి పరుగులు తీశారు. ఎవరికీ హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

భార్యపై కత్తిపీటతో దాడి

ఆపై భర్త ఆత్మహత్యాయత్నం
పరిస్థితి విషమించి భార్య మృతి

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను కత్తి పీటతో తలపై కిరాతకంగా నరికి, అనంతరం తాను పీక కోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు.వీరిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా భార్య పరిస్థితి విషమించి మృతి చెందింది. భర్త చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన జీలుగుమిల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి విజయ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్న ఉర్ల రామదాసు, శ్రీలత (30) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల వీరిద్దరికి తరచూ గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో శనివారం భర్త రామదాసు క్షణికావేశంలో భార్య శ్రీదేవిపై ఇంట్లో ఉన్న కత్తిపీటతో దాడి చేశారు. తలపై కిరాతకంగా నరకడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది.

పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భర్త

అనంతరం రామదాసు కూడా అదే కత్తిపీటతో పీక కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే వారిరువురి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శ్రీదేవి మృతి చెందింది. రామదాసు చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సిఐ వెంకటేశ్వరావు సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు

భయాందోళనలో ప్రజలు
అధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే రోడ్ల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రమాద భరితంగా పరిణమించాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కృష్ణ బడ్డీ కొట్టు నుంచి అమెరికన్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డును ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్, స్విచ్ అండ్ మెయిన్ బోర్డులు ఉండడంతో ప్రమాదానికి తావిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఏమాత్రం ప్రమాదం సంభవించకుండా రక్షణ కవచం నిర్మించాలని పట్టణంలోని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి ప్రమాద హేతువుగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేసి ప్రజల ప్రాణాలను రక్షించాలని పలువురు సామాజికవేత్తలు వేడుకుంటున్నారు.

ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించాలి : ఎంపిపి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రమ్య

ప్రజాశక్తి - పెదవేగి(దెందులూరు)

పెదవేగి మండలంలో 2020-2021 సంవత్సరాలకు సంబంధించి ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ జరుగుతుందని పెదవేగి ఎంపిపి తాతా రమ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ నిర్వహించే డిఆర్‌పిల సమీక్షా సమావేశంలో ఎంపిపి పాల్గొని మాట్లాడారు. ఈ ఆడిట్‌ను నిష్పాక్షపాతంగా నిర్వహించాలన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలు పారదర్శకంగా సేకరించాలని సోషల్ ఆడిట్ నిర్వహించే డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్స్‌ను కోరారు. గతంలో కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో కుటుంబాలతో పాల్గొన్నట్లు నకిలీ మస్టర్లు వేసి రికార్డులు తారుమారు చేసి కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ సారి పారదర్శకంగా సక్రమంగా ఆడిట్ నిర్వహించాలని ఎంపిపి రమ్య డిఆర్‌పిలకు వివరించారు. గతంలో వేగివాడ పంచాయతీలో కరువు పనులు మంజూరైతే ఆ పనులు కె.కన్నాపురం చెరువులో నిర్వహించిన సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. కొన్ని చెరువుల్లో మట్టి పనులు చేసి గట్లు పోసి వాటిని రోలర్‌లతో తొక్కించకుండా తొక్కించినట్లు చూపి ఆ గట్లపై మొక్కలు నాటకుండా నాటినట్లు చూపి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు కూడా పెదవేగి మండలంలో వచ్చాయన్నారు. కరువు పనుల్లో జరిగిన ఇటువంటి అవకతవకలు, అవినీతి అక్రమాలు సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసే అవకాశముందని పెదవేగి మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ హేమలత అన్నారు. మండలంలో ఉన్న 30 గ్రామ పంచాయతీల్లో ఒక్కొక్క డిఆర్‌పి 2 పంచాయతీల్లో ఆడిట్ చేస్తారని మండలంలో 15 మంది డిఆర్‌పిలు ఈ సోషల్ ఆడిట్‌ను శనివారం ప్రారంభించారని, ఫిబ్రవరి 1వ తేదీ నాటికి మొత్తం ఆడిట్ వివరాలు పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే పబ్లిక్ సోషల్ ఆడిట్ రిపోర్ట్ గ్రామాల వారీగా వెల్లడిస్తారని ఎపిఒ తెలిపారు.

24న ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశకి - ఏలూరు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏలూరు కార్యాలయం ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించే నిమిత్తం ఈ నెల 24వ ఉదయం 11 గంటలకు నూజివీడు ఎంపిడిఒ వద్ద జిల్లా స్థాయి ఇడిపి (ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖాధికారి పి.ఏసుదాసు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ఎల్‌డిఎం, బ్యాంకర్లు, పరిశ్రమల శాఖ, ఇతర శాఖల అధికారులు కూడా హాజరవుతారని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోకేష్ పాదయాత్ర జయప్రదం చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం టిడిపి, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక అశ్వారావుపేట ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ నాయకులు లోకేష్ యువగళం పాదయాత్రకు అధిక సంఖ్యలో యువత తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుతూరి రమాదేవి, తెలగరపు జ్యోతి, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పాతూరి అంబేద్కర్, రాష్ట్ర మహిళా కార్య నిర్వాహక కార్యదర్శి పగడం సౌభాగ్యవతి, ఏలూరు పార్లమెంటు మహిళా కార్యదర్శి గుళ్లపూడి శ్రీదేవి, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు నాయుడు పవన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రోడ్డు ప్రమాదాల మరణాలను గణనీయంగా తగ్గించే దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఉప రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రత, సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ, జెసి పి.అరుణ్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. జిల్లాలో గత ఏడాది కాలంలో రోడ్డు ప్రమాదాల్లో 333 మంది ప్రాణాలు కోల్పోయారని, 847 మంది గాయాల పాలయ్యారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు ప్రమాదాల్లో మరణాలు, క్షతగాత్రులను గణనీయంగా తగ్గించే దిశగా రవాణా, పోలీస్, అనుబంధశాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో జరిగిన ప్రమాదాల్లో కనీసం 25 శాతం తగ్గించగలిగే దిశగా ఆయా రవాణా, పోలీస్, పౌరులు, ఎన్‌జిఒలు కృషి చేయాలని, అలాంటి వారిని గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం రోజున రూ.లక్ష నగదు పురస్కారం కూడా అందిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి తాత్కాలికంగా లైసెన్స్ రద్దుచేసి పరివర్తన్ వెబ్‌సైట్‌లో వారి వివరాలు పొందుపరచాలన్నారు. రోడ్లపైకి పశువులను వదిలివెళ్లే యజమానులను హెచ్చరించి, రూ.మూడు వేల వరకూ అపరాధ రుసుము వసూలు చేయాలన్నారు. తదుపరి అదే చర్యకు పాల్పడితే ద్వారకాతిరుమలలోని గోశాలకు పశువులను తరలించాలని సూచించారు. నగరంలో కుక్కల బెడద లేకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటికి శస్త్ర చికిత్సలు నిర్వహించాలన్నారు. నగరంలో ఉన్న కళాశాలలు, పాఠశాలలు విడిచే సమయంలో కొంత వ్యవధి ఉండేలా సర్క్యులర్ ఇచ్చి టైమింగ్ మార్చాలని సూచించారు. మాదేపల్లి రోడ్డు, జ్యూట్ మిల్లు నుంచి మినీ బైపాస్ మీదుగా బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశ్రం ఆసుపత్రి నుంచి ఏలూరు బస్టాండుకు వచ్చే మార్గంలో ఆక్రమణలు తొలగించాలన్నారు. భీమడోలు సిహెచ్‌సిలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో 62 బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారని అందుకు సంబంధించిన చర్యలను చేపటాలన్నారు. పోలీసు, రవాణా, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖాధికారులు, ఇంట్రిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ (ఐరాడ్) ద్వారా కారణాలు తెలుసుకుని నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జెసి పి.అరుణ్ బాబు, జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాద్, డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు, ఏలూరు డిఎస్‌పి పైడేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఆర్‌టిఒలు కె.శ్రీహరి, ఎమ్‌డి మధానీ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ పనులు

అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

మండవల్లి:జాతీయ రహదారి విస్తరణ పనుల్లో తాగునీటి వృధాను అరికట్టాలని, గుత్తేదారుడు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కర్‌రావు, అప్పారావు మాట్లాడుతూ గుత్తేదారుడు విస్తరణ పనులను ఒక క్రమబద్ధతిలో నిర్వహించకుండా ఇష్టానుసారంగా చేపడుతున్నారన్నారు. ఈ పనుల వల్ల తాగునీటి పైపులు పగిలిపోయి పదిరోజుల నుండి తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైపులైన్లతో పాటు, డ్రెయినేజీ పాడవుతున్నాయన్నారు. ఇళ్ల ముందు దారిని కూడా సరిచేయడం లేదని, దీంతో ఇల్లు చేరుకోవాలంటూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డ్రెయిన్లలోని మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతుందని, రహదారిపై ప్రయాణించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తాగునీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శనివారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బండారు వెంకయ్య, బాలాజీ, శ్రీనివాసరావు, కాట్రగడ్డ సుబ్రహ్మణ్యం, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

23 నుంచి సామాజిక తనిఖీ

ఉంగుటూరు:ఉపాధి హామీ చట్టంలో మండలంలో 2021 - 22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, కూలీలకు వేతనాల చెల్లింపులపై ఈనెల 23 నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకూ సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ప్రసన్నరాజు తెలిపారు. మెటీరియల్ కాంపోనెంట్ పనుల కింద రూ.5,29,08,112, కూలీలకు వేతనాల కింద 4.41 లక్షల మందికి రూ.17,65,33,,697 చెల్లించారన్నారు. మండలంలో 27 గ్రామాల్లో జరిగిన పనులను సామాజిక తనిఖీ అధికారులు పరిశీలించి వివరాలను గ్రామసభల్లో వినిపిస్తారని తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

ఏలూరు స్పోర్ట్స్:ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ పోలీసు అధికారులకు సూచించారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు అమీనాపేటలోని సురేష్ చంద్ర బహుగుణ స్కూల్ ఆవరణ నుంచి పోలీసులు, రవాణాశాఖ సంయుక్తంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. ఈ ర్యాలీలో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు, ఆర్‌డిఒ కె.శ్రీహరి, ఎఆర్ డిఎస్‌పి కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉంగుటూరు:రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, సిబ్బంది హెల్మెట్ ర్యాలీ శనివారం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరుతూ ప్రజలను చైతన్యపరిచారు. చేబ్రోలు ఎస్ఐ స్వామి పాల్గొన్నారు

కైకలూరు రూరల్ : :ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సిఐ నాగరాజు కోరారు. కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించాలంటూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

మిర్చిపంట పరిశీలన

ముసునూరు:తామర, నల్లి పురుగుల వల్ల దెబ్బతిన్న మిర్చి పంటను ఎట్టకేలకు ఉద్యానవనశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రాష్ట్ర విపత్తుగా ప్రకటించి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం నూజివీడు డివిజన్ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన చేపట్టారు. ఈనెల తొమ్మిదో తేదీన నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిని అందించారు. దీనికి స్పందించిన అధికారులు మండలంలోని వలసపల్లి, గుళ్లపూడి, యల్లాపురం గ్రామాల్లో ఉద్యానవన శాఖ ఎడి జె.శాంతి, మండల ఉద్యానవన శాఖాధికారి ఆర్.హేమ మిర్చితోటలను పరిశీలించి, సలహాలు, సూచనలు చేశారు.

పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాస్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని మండల పాస్టర్ల సహవాసం కోరింది. ముదినేపల్లిలోని ఇమ్మానుయేలు చర్చిలో శనివారం మండల పాస్టర్ల సమావేశం పాస్టర్ వి.స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో పాస్టర్ ఎంకె.ఏసురత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రసన్నరాజు, యోహాన్, రాజేష్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : డిఎన్ఆర్

ముదినేపల్లి :అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన రాష్ట్రంలో సాగుతోందని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లిలో శనివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఉన్నాడని..!

జంగారెడ్డిగూడెం:మతిస్థిమితం లేని ఓ వృద్ధుణ్ని ప్రాణం ఉండగానే శ్మశానానికి తరలించి దహనం చేస్తున్నారనే ప్రచారం పట్టణంలో దుమారం లేపింది. శనివారం స్థానిక పాతబస్టాండు బస్ షెల్టర్‌లో ఉంటున్న మతిస్థిమితం లేని వృద్ధుడిని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చెత్త ట్రాక్టర్‌లో సమీపంలోని శ్మశాన వాటికకు తరలించారు. దీన్ని గమనించిన స్థానికులు అడ్డుకుని నిలదీశారు. ప్రాణాలతో ఉన్న వృద్ధుడిని శ్మశానానికి ఎందుకు తీసుకు వచ్చారని ప్రశ్నించారు. అయితే శ్మశానంలో ఉన్న షెడ్డు వద్దకు తీసుకు వచ్చామని సిబ్బంది బదులిచ్చారు. బస్‌షెల్టర్ వద్ద వృద్ధుడు దుస్తులు లేకుండా మల మూత్రాలు విసర్జించడంతో స్థానికుల అభ్యర్థన మేరకు శ్మశానవాటిక షెడ్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాకినాడకు చెందిన కోరుకొండ రామ్మోహనరావు ఇటీవల మతిస్థిమితం కోల్పోయి స్థానిక పాతబస్టాండు బస్‌షెల్టర్ వద్ద ఉంటున్నట్లు సమచారం.

స్థానిక మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు చొరవతో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వెంకటాద్రి మృతి హేతువాద ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు

బహు గ్రంథ రచయిత, హేతువాద ఉద్యమ నాయకుడు రావిపూడి వెంకటాద్రి మృతి దేశంలోని హేతువాద ఉద్యమానికి తీరని లోటని హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు కడలి రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటాద్రి వంద గ్రంథాలకు పైగా హేతువాద ఉద్యమంపై రచనలు చేశారని తెలిపారు. 20 సంవత్సరాల వయసు నుంచి ఉద్యమానికి ప్రచారం చేసిన వెంకటాద్రి ప్రముఖ నాస్తికోద్యమ నాయకులు పెరియార్ రామస్వామి నాయకర్, అన్నా దొరయ్‌లను తన స్వగ్రామం నాగండ్ల రప్పించి కార్యక్రమాలు చేయించారని తెలిపారు. దేశ వ్యాప్తంగా పర్యటించి హేతువాద ప్రచారం చేసిన గొప్ప నిబద్ధత కలిగిన వ్యక్తి వెంకటాద్రి అని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల హేతువాద సంఘం తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. పట్టణంలో పదో సచివాలయం పరిధిలో శనివారం 91 రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా ప్రజలకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయింది

కేత సీత, భర్త: నాగ పండు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. సిద్దాంతం నుండి పెనుగొండ వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **L9025927 గల పాస్‌పోర్టు** ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

కేత సీత
భర్త : నాగపండు, సిద్ధాంతం
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.
సెల్ : 95532 72178

పాస్‌పోర్టు పోయినది

KURELLA DURGA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 07-11-2017న **R5904913** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు నరసాపురం పట్టణం మెయిన్ రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

KURELLA DURGA
W/o. K.Venkateswara Rao
D.No. 13-1-28/2, Near Medrla Bridge
Narasapur-534275, West Godavari Dist., A.P.,

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు :: అమలాపురం

ఓ.ఎస్.నెం. 21/2022

Between:
బొంతు కృష్ణ కుమారి ...వాది
అండ్
పి.వి.కృష్ణం రాజు ...ప్రతివాది

ప్రకటన

పెనుమత్స వంశీ కృష్ణంరాజు, తండ్రి: రామకృష్ణం రాజు, హిందూ, డాక్టర్, వయస్సు 27 సం॥లు, డో.నెం. 33-8-2, కంచి రాజు గారి వీధి, తణుకు, తణుకు మండలం, టౌన్ హాల్ కాంప్లెక్స్ ఎదురుగా, తణుకు, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో ఓ.ఎస్.నెం. 21/2022లో శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ప్రతివాది అయిన మీకు నోటీసు పేపరు ప్రకటన ద్వారా తెలియేయడమైనది. వాయిదా రోజున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన వారి కోర్టులో హాజరు కావలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా తేదీ: 30-01-2023
సమయం: 10:30 ని॥లకు

కె.మల్లపరాజు
కె.ఎస్.శ్రీరామ్,
అడ్వకేట్స్, అమలాపురం.

మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు జిల్లా

ఓ.యస్.నెం. 8/2022

బిట్వీన్:
శ్రీ వేగుంట మాధవరావు ...వాది
VS
శ్రీమతి వూరకరణం సీతాదేవి and 6 వగైరా ...ప్రతివాదులు

1) సదరు దావాలో 4వ ప్రతివాది చిరునామా:
D4: To: శ్రీమతి మాదిరాజు విజయలక్ష్మి, భర్త: ఎం.రవీంద్రనాథ్ ఠాగూర్, తండ్రి: లేటు వి.రామారావు, C/o. మాధవరావు, డౌన్ ఫ్లోర్, ఎన్.కళేశ్వరరావు హౌస్, గాంధీ మైదానం దగ్గర, పడమర వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.
2) సదరు దావాలో 6వ ప్రతివాది చిరునామా:
D6: To: వూరకరణం నిఖిత, తండ్రి: లేటు జగన్‌మోహనరావు, గణేష్ ఉమశ్రీ అపార్ట్‌మెంట్, 3వ ఫ్లోర్, ప్లాట్ నెం. 303, దొంగల మండపము దగ్గర, పడమర వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.

మీరు పై తెలిపిన ఓ.ఎస్.నె. 8/2022లో 4వ ప్రతివాది మరియు 6వ ప్రతివాది అయి ఉన్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీరు **ఫిబ్రవరి నెల 10వ తేదీ 2023వ సం॥రం ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టులో హాజరు కావలెను.** లేని ఎడల సదరు గ్రంథము మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ: 10-02-2023

కె.ఆర్.కె.చౌదరి, అడ్వకేట్,
ఏలూరు. సెల్: 98486 05066